క్లుప్తంగా

బీటీ రోడ్లను నిర్మించాలి



వెల్దండ: మండల కేంద్రం నుంచి ఆయా గ్రామాలకు బీటీ రోడ్లు నిర్మించాలని మాజీ ఎంపీపీ చెదురుపల్లి వెంకటయ్యగౌడ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు మధుసూధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రాచూర్–వెల్దండ రోడ్డును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపాటి వర్షాలకే బురదమయంగా మారిపోతున్నాయన్నారు. స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే బీటీ రోడ్ల నిర్మాణాలకు గతంలో శంకుస్థాపన చేశారని కాని నెలలు గడుస్తున్నా నేటికి టెండర్లు వేయలేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజయ్య, నాయకులు లింగంముదిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, జోగురవికుమార్, అమర్‌సింగ్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పెంట్లవెల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు, ఈగలు ఆవాసాలు ఏర్పర్చకుండా చూసుకోవాలన్నారు. ఆశావర్కర్లు, సిబ్బంది గ్రామాలలో ఇంటింటికి వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని కోరారు.

మహాసభలకు తరలిన ఆర్టీసీ ఉద్యోగులు

కల్వకుర్తి రూరల్: హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆర్టీసీ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ 8వ మహాసభలకు మంగళవారం కల్వకుర్తి డిపో నుంచి ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం సభ్యులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి సదానందం మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘం ఎల్లప్పుడు పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీధర్, శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ఉప్పునుంతల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధిపొందడానికి రైతు భరోసా ఇచ్చి సంబరాలు చేస్తున్నారని వివరించారు. రూ.2 లక్షల రుణమాఫీ పూర్తిగా అమలు చేసి కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వడంతోపాటు భూమి లేని పేదలకు ఆత్మీయ భరోసా అందించాలని కోరారు.

మూఢనమ్మకాలపై అవగాహన



పెద్దకొత్తపల్లి: మండలంలోని ముష్టిపల్లిలో సోమవారం రాత్రి ప్రజలకు మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సతీష్ మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల బాణామతి పేరుతో భయాందోళనకు గురిచేశారని అటువంటి వదంతులు నమ్మొద్దని సూచించారు. గ్రామంలో ప్రజలంతా శాంతియుతంగా జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో మూఢనమ్మకాల నిర్మూలన సంఘం సభ్యులు రాజు, శ్రీకాంత్, నీలకంఠం గ్రామస్తులు పాల్గొన్నారు .

రికార్డుల పరిశీలన

బిజినేపల్లి: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు ఉంటాయని ఎంఈఓ రఘునందన్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని కారుకొండ గ్రామానికి చెందిన ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తుందన్నారు. విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు వచ్చేవిధంగా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం రామృష్ణ, ఉపాధ్యాయులు రామకృష్ణ, ఇంద్రాణి, భాగ్యలక్ష్మి, శ్రీకాంత్, విద్యార్థులు ఉన్నారు.



రైతు భరోసా సంబరాలు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం వానాకాలం రైతు భరోసా పెట్టుబడిసాయం రైతుల ఖాతాల జమ కావడంతో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

■ ఉప్పునుంతల మండల కేంద్రంలోని పోచమ్మ చౌరస్తాలో కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎంకు, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, నాయకులు తిప్పర్తి నర్సింహారెడ్డి, అనంతప్రతాప్‌రెడ్డి, రేణయ్య, రామచంద్రయ్య, జగన్మోహన్‌రెడ్డి, భాస్కర్, శేఖర్‌గౌడ్, తిర్పతయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

■ చారకొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు సంబరాలు నిర్వహించారు, సీఎం రేవంత్ రెడ్డి చిత్రాపటానికి క్షీరాభిషేకం చేశారు. మండలంలోని 9600 మంది రైతులకు రైతు భరోసా నిధులు జమ అయ్యాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్ గౌడ్ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి,నాయకులు లక్ష్మయ్య, అంజయ్య, చంద్రశేఖర్, గోరటి శివ, వెంకటయ్య గౌడ్, ప్రశాంత్ నాయక్, శ్యామ్, పూప్‌సింగ్, మాధవ రెడ్డి, రామకృష్ణ, ఆంజనేయులు, సంగయ్య రైతులు తదితరులు ఉన్నారు.



అచ్చంపేటలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

■ వంగూరు మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు అల్వాల్‌రెడ్డి, రమేష్‌గౌడ్ కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, క్యామ మల్లయ్య, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ అచ్చంపేట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు రైతు భరోసా సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

■ అమ్రాబాద్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రైతుల రైతు భరోసా సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినారాయణ, బాలింగం గౌడ్, పంబలి బుచ్చయ్య, సంతోష్ తదితర రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

■ అదేవిధంగా వెల్దండ, బల్మూరులో రైతు భరోసా పథకం విజయోత్సవాలు నిర్వహించారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



ఉప్పునుంతలలో..



చారకొండలో..



అమ్రాబాద్‌లో..

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కందనూలు: విద్యార్థులు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో శ్రామిక వికాస కేంద్రం, జిల్లా బాలల పరిరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో అమ్మాయిలపై జరుగుతున్న మోసాలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డీఈఓ హాజరై మాట్లాడారు. బాలికలపై అఘాయిత్యాలు జరగకుండా స్వచ్ఛంద సంస్థలు, వికాస కేంద్రాలు పనిచేయడం హర్షనీయమన్నారు. ప్రభుత్వం బాలికల డ్రాప్ అవుట్‌ను తగ్గించడానికి కస్తూర్బా పాఠశాలలను నెలకొల్పామన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి శ్రీశైలం, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ లక్ష్మణరావు, శోభారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రమేశ్‌కుమార్

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మన్ననూర్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కానిస్టేబుల్ రాముడు అన్నారు. మంగళవారం స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలోని బాలికలకు అమ్రాబాద్ పోలీసులు సైబర్ నేరాలు–ఈవ్‌టీజింగ్‌లను అవగాహన కల్పించారు. విద్యార్థులు స్వేచ్ఛాయుత వాతావరణంలో చదువుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్లు, అల్లరి మూకలు, ఆకతాయిల నుంచి అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితులలో 100కు డయల్ చేయాలని కోరారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అమ్రాబాద్ పోలీసులు రాజశేఖర్, మత్రునాయక్, వాస్‌దేవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెంటనే పనులు చేపట్టాలని మంగళవారం అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు లబ్ధిదారులు ఇంటి నిర్మాణాల్లో వేగం పెంచుతున్నారు.

■ తాడూరు మండలంలోని పాపగల్ సిర్సవాడ గ్రామంలో ఎంపీడీఓ అంజనేయులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేయించారు.

■ లింగాల మండలంలో అవుసలికుంట పంచాయతీకి మొత్తం 45 ఇళ్లు మంజూరు కాగా అధికారులు 38 ఇళ్ల నిర్మాణాలకు ముగ్గు పోశారు. ఇప్పటికే లబ్ధిదారులు 23 ఇళ్ల నిర్మాణాలను చేపట్టారని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు.

■ అమ్రాబాద్ మండల కేంద్రంలోని లక్ష్మాపూర్‌లో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు ఎంపీడీఓ లింగయ్య, హౌసింగ్ ఏఈ బిక్కు నాయక్ భూమిపూజ చేశారు.



నూకలచింతతండాలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందిస్తున్న ఎంపీఓ వెంకటేష్

■ చారకొండ మండలంలోని నూకలచింతవాడిక తండాలో మంగళవారం హౌసింగ్ ఏఈ సురేష్, ఎంపీఓ వెంకటేష్ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. రవికుమార్, కమలాకర్, దాంజ్యానాయక్, ధగ్నానాయక్, గణేష్, తిరుపతి ఉన్నారు. కార్యక్రమంలో రేణయ్య, అంబనారాయణ, వెంకటేష్, మోతీలాల్ నాయక్ పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులతో రైతుల వాగ్వాదం

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు అధికారుల ఉదాసీనత వల్ల బ్యాంకు ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. రైతులు తీసుకున్న రుణాలు వడ్డీతో సహా చెల్లించిన రెండు మూడు రోజులలో రెన్యూవల్ చేసి తిరిగి రుణాలు ఇవ్వాల్సి ఉండగా 15 రోజులుగా ఇవ్వకుండా కాలయాపన చేయడంతో మంగళవారం బ్యాంకు అధికారులతో రైతులు వాగ్వివాదానికి దిగారు. తీసుకున్న రుణాలు చెల్లించినా ఎందుకు రెన్యూవల్ చేయడం లేదని ప్రశ్నించారు. పంటరుణాలు వడ్డీతో సహా చెల్లించి ఎనిమిది రోజులు గడిచినా తిరిగి రుణం ఎందుకు ఇవ్వడంలేదని గుమ్మకొండ, ఎదిరేపల్లికి చెందిన ఇద్దరు రైతులు బ్యాంకు అధికారులతో వాదనకు దిగారు. సరిపడా సిబ్బంది లేరని 15 రోజులుగా ఫీల్డ్ ఆఫీసర్ సెలవులో ఉండడంతో ఆలస్యమైందని మేనేజరు వివరించారు. అమాయక రైతులు రోజుల తరబడి బ్యాంకు చుట్టు తిప్పుకోవడం సరికాదని ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.



గుమిగూడిన రైతులు

సీపీఐ, సీపీఎం నాయకుల నిరసన

నాగర్‌కర్నూల్ రూరల్: అమెరికా సామ్రాజ్యవాదం వెంటనే నశించాలని పశ్చిమాసియాలో మారణ హోమానికి పాల్పడుతున్న అమెరికా ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ ఉపరితలంపై దాడులను వెంటనే అపేయాలని సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు అనంద్‌జీ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ పర్వతాలు హాజరయ్యారు. సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం శ్రీనివాసులు, పోదిల రామయ్య, అశోక్, నాయకులు వెంకటేష్, మల్లికార్జున్, సురేష్, కురుమయ్య, రవి, సీపీఐ జిల్లా నాయకులు లక్ష్మిపతి, వెంకటస్వామి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్: అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని నినదిస్తూ సీపీఐ, సీపీఎం నాయకులు మంగళవారం కొల్లాపూర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ సామ్రాజ్యవాద కాంక్షతో పశ్చిమాసియా దేశాలపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. అణ్వాయుధాల పేరుతో ఇతర దేశాలపై ఏకపక్ష దాడులకు దిగడం హేయనీయమన్నారు. ఇరాన్, పాలస్తీనాలో సామాన్యప్రజలపై ఇజ్రాయిల్, అమెరికాలు దాడులకు పాల్పడటాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శివవర్మ, తారాసింగ్, సీపీఐ నాయకులు యూసూఫ్, కురుమయ్య తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి రూరల్: యుద్ధాల వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతారని సీపీఐ రాష్ట్ర నాయకుడు ఫయాజ్, సీపీఎం జిల్లా నాయకుడు ఏపీ మల్లయ్య అన్నారు. ఇరాన్‌పై అమెరికా దాడి చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం సాయంత్రం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో ఇరు పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తే మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీసేలా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహార శైలి కనిపిస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, పరశురాములు, గోపాల్, శివ, శంకర్, భరత్ పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

తెలకపల్లి: మండల కేంద్రంల్లిలో వివిధ కేసుల్లో పట్టుపడిన వాహనాలను 26 తేదీన వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ సూర్యకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

సకాలంలో బిల్లులు చెల్లించేందుకు కృషి



వెల్దండ: పాఠశాలలో వంట ఏజెన్సీ నిర్వాహకులకు సకాలంలో బిల్లులు చెల్లించేందుకు కృషి చేస్తానని ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు అన్నారు. బిల్లులు రాకపోవడంతో మండల కేంద్రంలోని మోడల్ ఆదర్శ పాఠశాలలో వంట ఏజెన్సీవారు రెండురోజులుగా భోజనం తయారు చేయడం లేదు. దీంతో పాఠశాల సిబ్బంది వంట చేసి విద్యార్థులకు వడ్డించారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ పాఠశాలను సందర్శించారు. వంట ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని చెప్పడంతో వంట చేసేందుకు ముందుకు వచ్చారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు భారతమ్మ, ప్రిన్సిపాల్ శ్రీధర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాలలో విద్యార్థుల చేరిక



తాడూరు: మండల కేంద్రంలో మంగళవారం ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. కొత్తగా 6 మంది విద్యార్థులను చేర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలతోపాటు, దుస్తులు, మధ్యాహ్న భోజనం , మౌలిక వసతులు ఉంటాయని వివరించారు. పిల్లలను ప్రభుత్వ బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు.

రైతుభరోసాపై అయోమయం

మన్ననూర్: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు మంగళవారం రైతుల ఖాతాలో జమ చేసింది. కాని కొందరి రైతులకు పెట్టుబడి సాయం అందకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. దీంతో మండలంలోని అనేక మంది రైతులకు భరోసా డబ్బులు జమ కాలేదు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి అమ్రాబాద్ మండలం రైతు భరోసా సంబరాలు జరుపుకున్నారు. కాని అమ్రాబాద్‌లో కొందరి రైతులకు నిధులు జమకాకపోవడంతో అయోమయంలో పడ్డారు. అందుకు కారణాలు ఏమిటో కూడ తెలియక దిగాలు చెందుతున్నారు. అధికారులు స్పందించి రైతు భరోసా అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతుల ఖాతాలో రూ.394 కోట్ల జమ

తాడూరు: జిల్లాలో సాగులో ఉన్న ప్రతి ఎకరాకు రైతు భరోసా అందిందని కలెక్టర్ బదావత్ సంతోష్ వివరించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి మండలంలోని ఇంద్రకల్ రైతు వేదికలో అధికారులతో పాటు రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 9 రోజుల్లోనే 2.92 లక్షలకు పైగా రైతుల ఖాతాల్లో రూ. 394 కోట్లకు పైగా రైతు భరోసా నిధుల జమ అయ్యాయని తెలిపారు. జిల్లాలో రైతులు వ్యవసాయాన్ని లభసాటిగా మార్చేందుకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభిస్తునట్లు వివరించారు. ఆయిల్‌పాం పంట సాగుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, హర్టికల్చర్ వెంకటేశం, తహసీల్దార్ జయంతి, ఏఓ సందీప్‌కుమార్‌రెడ్డి, క్లస్టర్ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.



వీసీని వీక్షిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

వీసీకి హాజరైన రైతులు

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీసీ కార్యక్రమానికి రైతులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. పలు గ్రామాలకు చెందిన రైతులు, పలువురు కాంగ్రెస్ నాయకులు తిలకించారు. ఏడీఏ వాసు, మండల వ్యవసాయ అధికారి కమల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, సీనియర్ నాయకులు మల్లయ్యగౌడ్, శ్రీనివాస్‌బహదూర్, ఉస్మాన్, లక్ష్మీనారాయణ, నర్సింహ, శివ, రైతులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్: రైతుభరోసా విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ ప్రసంగాన్ని కొల్లాపూర్‌లో రైతులు వీక్షించారు. పట్టణంలోని రైతువేదిక భవనంలో వీడియో కాన్ఫరెన్స్ కోసం టీవీని ఏర్పాటు చేశారు. మండల వ్యవసాయ శాఖ ఏఈ చిన్నహుస్సేన్ యాదవ్ పర్యవేక్షించారు. రైతులతో పాటు ఏఈఓలు పాల్గొన్నారు.

శాఖలవారీగా సమాచారం సేకరించాలి

ఊర్కొండ: వచ్చే నెల 31వ తేదీ వరకు శాఖలవారీగా సమాచారం సేకరించి సిద్ధంగా ఉంచాలని ఎంపీడీవో కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో అధికారులు, అంగన్‌వాడీ టీచర్స్, ఏఎన్‌ఎం, ఏఈఓ, పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు ఓరియంటేషన్ ట్రైనింగ్ నిర్వహించారు. పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ నేషనల్ పంచాయతీ అవార్డ్స్ 2023–24 కోసం అధికారులు వివరాలు సేకరించాలన్నారు. డాటా ఎంట్రీపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎం. శ్రీనివాసులు,తహసీల్దార్ యూసుఫ్ అలీ,వ్యవసాయ అధికారి దీప్తి,మెడికల్ ఆఫీసర్ శివకృష్ణ, ఐసిడిఎస్ సూపర్ వైజర్ అరుణ, ఏపిఎం సంతోష్, , మండల విద్యాశాఖ అధికారి శంకర్ నాయక్ ఏఈ పంచాయతీరాజ్ మహేందర్, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

లింగాల: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాబోయే రెండు నెలల తర్వాత కేంద్ర బృందం గ్రామ పంచాయతీల్లో పర్యటిస్తుందని, ఆయా గ్రామాలను పరిశీలించి సౌకర్యాల గురించి తెలుసుకొని ఆదర్శ గ్రామ పంచాయతీలుగా ఎంపిక చేయడం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బారులుదీరిన రైతులు



పెంట్లవెల్లి: రైతు భరోసా నిధుల జమ కావడంతో మంగళవారం బ్యాంకులో రైతుల రద్దీ కన్పించింది. కొంత మంది డబ్బులు తీసుకునేందుకు, మరికొంతమంది డబ్బులు పడ్డాయో లేదో తెలుసుకునేందుకు అధికసంఖ్యలో తరలివచ్చారు. బ్యాంక్ బయట రైతుల గుమిగూడారు.

జమిస్తాపూర్‌కు బస్సు సౌకర్యం



తెలకపల్లి: మండలంలోని జమిస్తాపూర్ నుంచి కారువంగ వరకు మంగళవారం బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం జమిస్తాపూర్‌లో బస్సును అలంకరించారు. పాఠశాల హెచ్‌ఎం చల్మారెడ్డి, గ్రామస్తులు బస్సును ప్రారంభించారు. 28 మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. శ్రీనివాసులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేద్దాం

కల్వకుర్తి రూరల్: జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి ఆంజనేయులు కోరారు. మంగళవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సీడీపీఓ భాగ్యమ్మకు సమ్మె నోటీసు అందేశారు. మాసమ్మ, శోభావతి, మహాలక్ష్మి, రాములమ్మ, బిబి, శారద, ఫాతిమా గ్రామపంచాయతీ కార్మికులు శంకర్, మల్లేష్, బాల మైసమ్మ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బుధవారం విద్యుత్ మరమ్మతు కారణంగా శ్రీనగర్ కాలనీ, ఎర్రగడ్డ కాలనీ పరిసరాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మాన్యనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

తహసీల్దార్‌కు వినతి

చారకొండ: మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు కేటాయించి, భవనాలు నిర్మించాలని బీజేపి మండల నాయకడు చింతపల్లి కిరణ్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునీతకు మండల బీజేపి నాయకులు వినతి పత్రం అందజేశారు. వెంకట్‌గౌడ్, శ్రీకాంత్, వెంకటరమణ, జంగయ్య తదితరులు ఉన్నారు.

పోరాటాలతో సమస్యల పరిష్కారం

కల్వకుర్తి రూరల్: ఉద్యోగుల సమస్యలు పోరాటాల ద్వారానే పరిష్కారం అవుతాయని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం ఏఐఐఈఏ అధ్యక్షుడు హుస్సేన్ పాషా అన్నారు. మంగళవారం భోజన విరామ సమయంలో ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, ఉద్యోగాల నియామకం, పాత పెన్షన్, పాలసీలపై జీఎస్టీ తొలగింపు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఏఐఐఈఏ భాగస్వామ్యం అవుతుందన్నారు. సమ్మెలో భాగంగా నిరసన వ్యక్తం చేశారు. నాయకులు అభిషేక్, సామ్య కృష్ణారెడ్డి, శ్రీధర్, శ్రీకర్, నాగేష్, ప్రతాప్, అనురాగ్, ప్రవీణ్, నిరంజన్ అమ్మ, లక్ష్మి, శేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హుస్సేన్ పాషా

పేద విద్యార్థులకు అండగా ఉంటా



ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డికి మొక్క అందజేస్తున్న విద్యార్థినులు

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని వనపట్లలో మంగళవారం కూచుకుళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి దంపతులు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు అండగా ఉంటానన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కల్వకుర్తి వ్యవసాయం మార్కెట్ కమిటీ డైరెక్టర్ దాచేపల్లి శ్రీనివాసులు స్కూలు బ్యాగులు, ప్లేట్లు, గ్లాసులు, పలకలను మంగళవారం పంపిణీ చేశారు. ఆయన తల్లిదండ్రులు సరస్వతమ్మ, బాలయ్య జ్ఞాపకార్థం వీటిని అందించారు. స్కూల్ కమిటీ చైర్మన్ సుగుణ, కార్యదర్శి బాలరాజు, హెచ్‌ఎం జోసఫ్ ఉపాధ్యాయురాలు రాధిక పాల్గొన్నారు.